## స్టోర్ రూంను తలపిస్తున్న పంచాయతీ భవనం



మంచాల, ఫిబ్రవరి 26 : మండల పరిధిలోని లోయపల్లి గ్రామ పంచాయతీ భవనంలో అధికారులు, సర్పంచ్, వార్డు సభ్యులు నిర్వహించుకునే సమావేశ మందిరం స్టోర్ రూంను తలపిస్తున్నది. ప్రజాప్రతినిధులు తమ సమస్యలను విన్నవించుకునేందుకు ఏర్పాటు చేసుకున్న సమావేశ మందిరంలో డ్రైనేజీల్లో మురుగును తీసే పారలు, బ్లీచింగ్ ఫౌడర్ డబ్బాలు, కట్టెలతో పాటు తదితర వస్తువులతో నిండిపోయింది. గ్రామ పంచాయతీ భవనాన్ని స్టోర్ రూంగా మార్చడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## రోడ్డుపై మురుగు.. పరుగు



వెంకటేశ్వర నగర్ కాలనీలోని ప్రధాన రోడ్డుపై పారుతున్న మురుగు

మంచాల, ఫిబ్రవరి 26 : మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలోని వెంకటేశ్వర నగర కాలనీలోని ప్రధాన రోడ్డుపై 20రోజుల నుంచి మురుగు పారుతున్నది. దుర్వాసన వస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ ఉంది. అది నిండిపోయి మురుగు రోడ్లపైకి రావడంతో బురదమయం కావడంతో ప్రజలు, వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఎన్‌బీఎస్ మండల ప్రధాన కార్యదర్శికి సన్మానం



మంచాల, ఫిబ్రవరి 26 : మండల పరిధిలోని జాపాల గ్రామానికి చెందిన అశ్వల వెంకటేశ్‌ను నాయీ బ్రాహ్మణ సంఘం (ఎన్‌బీఎస్) మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం వివిధ పార్టీల నాయకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో చంద్రకాంత్, మహేశ్‌గౌడ్, రవి, శ్రీశైలం, నర్సింహ, జంగయ్య, ధనుంజయ్, కృష్ణ, పాండు తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి సబితారెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న బీఆర్‌ఎస్ మొయినాబాద్ నాయకులు

# బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలి
- హామీల అమలులో పూర్తిగా విఫలం
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి
- పార్టీ శ్రేణులకు పిలుపు

మొయినాబాద్, ఫిబ్రవరి 26 : రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం సంతరించుకుంటుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మొయినాబాద్ మండల నూతన అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి శివరాత్రిని పురస్కరించుకుని బుధవారం పార్టీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డితో కలిసి ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌దే రాజ్యమన్నారు. రాష్ట్రంలో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించడంతో ప్రజల వ్యతిరేకత మూట కట్టుకుంటుందని తెలిపారు. ఆ వ్యతిరేకతతోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనే బాగుండేదనే భావన ప్రజల్లో కలుగుతుందని చెప్పారు. ప్రజల నుంచి వస్తున్న అనూకూలతను పార్టీ పూర్వవైభవానికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలి

ప్రజా సమస్యలపై బీఆర్‌ఎస్ శ్రేణులు ఎప్పటికప్పుడు స్పందించి వాటి పరిష్కారం కోసం పోరాటం చేయాలని మాజీ మంత్రి సబితారెడ్డి సూచించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ.. ప్రజల మద్దతును కూడగడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని కోల్పోవడంతో ప్రజలు చాలా బాధపడుతున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రతి ఎన్నికలు ఫలితాలు బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా వస్తాయని, అందుకు అనుగుణంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయ పరుచుకుంటూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీహరియాదవ్, కృష్ణారెడ్డి, ఎం రవియాదవ్, సురేందర్‌గౌడ్, పరమేశ్, షాబాద్ ప్రవీణ్, చాకలి అరవింద్‌రజక, రాజు, రాజేష్, అసిఫ్, రవిపాల్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 47వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



దీక్షలో పాల్గొన్న భూ బాధితులు

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 26 : శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్, వెలిమెల తండా శివారులోని లంబాడ గిరిజనులు తమ 80 ఎకరాల బిలాదాకాల భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 47వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న భూ బాధితులు మాట్లాడుతూ.. న్యాయ పోరాటానికి సిద్ధమైన ఇన్ని రోజులుగా దీక్ష చేస్తున్న తమకు ప్రభుత్వం న్యాయం జరిగేలా చూడాలని వేడుకున్నారు. దీక్షలో పి.లక్ష్మణ్, జనార్దన్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రవి, శంకర్, బాబు, లక్ష్మణ్, చందర్ రెడ్డి, గోపి, సోనిబాయి, తులసి, గోమా, మున్న, శంకరమ్మ, మాణెమ్మ, పి.కవిత, కొండకల్ మాజీ వార్డు సభ్యుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మర్రివాగు రాజు, తండా వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## అధైర్యపడొద్దు అండగా ఉంటాం

కేశంపేట, ఫిబ్రవరి 26: కుమ్మరి రాములమ్మ (60) కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ప్రేమ్‌కుమార్‌గౌడ్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన కుమ్మరి రాములమ్మ మృతదేహానికి బీఆర్‌ఎస్ నేతలు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తక్షణ సహాయంగా రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేసి అధైర్యపడొద్దు అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, సత్యనారాయణ, యాదయ్యగౌడ్, శివ, దశరథం, లింగం, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

# ముక్కంటి.. నినుగంటి

- శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు
- కిటకిటలాడిన ఆలయాలు
- మార్మోగిన శివనామస్మరణ



షాద్‌నగర్ రూరల్ : రామలింగేశ్వరుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

జిల్లాలో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు ఉపవాస దీక్షలు పాటిస్తూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల వద్ద దీక్షలు విరమించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరు పాల్గొన్నారు. - న్యూస్ నెట్‌వర్క్, రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 26



ఇబ్రహీంపట్నం : నోముల మల్లిఖార్జునస్వామి ఆలయానికి భారీగా తరలివచ్చిన గురుకుల విద్యాపీఠం విద్యార్థులు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు

## ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



విరాళం అంజేస్తున్న దాత సాయికుమార్

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 26 : చేవెళ్ల మండల పరిధిలోని తంగడిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకొచ్చి విరాళాలు అందజేస్తున్నారు. బుధవారం తంగడిపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్ ఆలయ నిర్మాణంలో తమ వంతు సహకారంగా రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాత సాయికుమార్‌ను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనూషాసత్తయ్యగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు రాములుగౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జైహింద్ పార్కును ప్రారంభించాలి

- బీఆర్‌ఎస్ హయాంలో పార్కు నిర్మాణ పనులు పూర్తి చేశాం
- కాలనీల్లో డ్రైనేజీ సమస్యలను పట్టించుకోరా..
- మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి




జైహింద్ పార్కు ఎదుట కాలనీవాసులతో కలిసి నిరసన తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 26 : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో హెచ్‌ఎండీఏ నిధులు దాదాపు రూ.2కోట్లు వెచ్చించి హయత్‌నగర్ డివిజన్ సీటీవో కాలనీలో నాలుగు వేల గజాల విస్తీర్ణంలో నిర్మించిన జైహింద్ పార్కును వెంటనే ప్రారంభించాలని హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం హయత్‌నగర్‌లోని జైహింద్ పార్కు ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు, స్థానిక కాలనీవాసులతో కలిసి మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఇన్‌చార్జి మంత్రి సమయమివ్వక పోవడంతో జైహింద్ పార్కు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. చుట్టుపక్కల ప్రాంతాలైన ఆరు కాలనీల్లో ప్రధానంగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా నెలకొందన్నారు. వాటి నిర్మాణానికి కొత్తగా నిధులు కేటాయించడం లేదని, నూతన పనులకు శ్రీకారం చుట్టడం లేదని అసహనం వ్యక్తం చేశారు. 15 నెలలుగా కాలనీల్లో సమస్యలను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని ఆరోపించారు. డ్రైనేజీల్లో పందుల బెడద అధికమై కాలనీల్లో దోమలు విజృంభిస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలు ఇంటి పన్నులు, ఇంటి అనుమతులకు రూ.లక్షల్లో చెల్లించి ఇంటి నిర్మాణాలకు అనమతులు తీసుకుంటున్నారని, మున్సిపల్, జీహెచ్‌ఎంసీ అధికారులు ఆయా కాలనీవాసుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. నిధుల కొరతతోనే ఆయా కాలనీలకు మౌలిక వసతులు కల్పించలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి దూరంలో ఉందన్నారు. జైహింద్ పార్కును ప్రారంభించి చుట్టుపక్కల కాలనీలైన గ్రీన్‌వుడ్‌కాలనీ, వాసవీకాలనీ, బ్లడ్ బ్యాంక్ కాలనీ, సీటీవో కాలనీల్లో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆయా కాలనీవాసులకు మద్దతుగా బీఆర్‌ఎస్ ఉంటుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, నాయకులు భాస్కర్‌సాగర్, మల్లేశ్ముదిరాజ్, మహిళా నాయకురాలు సింగిరెడ్డి మల్లీశ్వరిరెడ్డి, సీటీవో కాలనీ సింగం వెంకటేశ్వర్లు, బ్లడ్ బ్యాంక్ కాలనీ నరసింహారెడ్డి, గ్రీన్‌వుడ్ కాలనీ వాసి గణేశ్‌రెడ్డి, వాసవీ కాలనీకి చెందిన రవి తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీ నగర్ నియోజకవర్గంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చంపాపేట డివిజన్ కర్మన్ ఘాట్ లోని వెంకటేశ్వర హాస్పిటల్ పక్కవీధి నుంచి, వంగ శంకరమ్మ గార్డెన్ వరకు నిర్మించాల్సిన నాలా నిర్మాణ పనులు పద్మనగర్ కాలనీ వరకు పూర్తయ్యాయి. అక్కడి నుంచి పనులు నిలిచిపోయాయి. నాలా పనులు పూర్తి అయితే నీటి ముంపు నుండి గట్టెక్కుతారు. కాని పనులు ఆగిపోవటం తో రాబోయే వర్షాకాలం కూడా ఇబ్బందులు తప్పేలా లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# 14నెలలుగా.. అతీగతీ లేదు

## మూలకు పడిన ఎస్‌ఎన్‌డీపీ.. నత్తకు నడకలు నేర్పుతున్న పనులు

- కేసీఆర్ హయాంలో 29 చోట్ల పనులు పూర్తి
- 4 లక్షల కుటుంబాలకు తప్పిన వరద ముంపు
- పనులు చేయలేక చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కారు
- మొదటి దశే పూర్తి కాని వైనం..రెండో దశ దేవుడెరుగు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): మహానగరంలో అనేక ప్రాంతాలను వరద ముంపు నుంచి తప్పించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రారంభించిన నాలా అభివృద్ధి పనుల (ఎస్‌ఎన్‌డీపీ) పై కాంగ్రెస్ ప్రభుత్వం శీతకన్ను వేసింది. గడిచిన 14 నెలలుగా పురోగతిలో ఉన్న ఎస్‌ఎన్‌డీపీ మొదటి దశ ప్రాజెక్టు పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యపు ధోరణిని అవలంబిస్తున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఎస్‌ఎన్‌డీపీ పనుల్లో భాగంగా 40 ప్రాంతాల్లో 29 చోట్ల పనులను పూర్తి చేసి దాదాపు 175 కాలనీలకు వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారం చూపింది. 43 కిలో మీటర్ల పనుల పూర్తితో దాదాపు 4 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూర్చింది. కానీ ప్రజాపాలన ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ సర్కారు 11 చోట్ల పురోగతి పనులను పూర్తి చేయలేక చేతులెత్తేసింది. ఫలితంగా నేటికీ ఎస్‌ఎన్‌డీపీ పనులు మూడు అడుగులు ముందుకు–ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి. చేసిన పనులకు జీహెచ్‌ఎంసీ బిల్లులు చెల్లించడం లేదని , పెండింగ్ బిల్లులు ఇస్తేనే పనులు చేపడతామంటూ కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు చేతులెత్తేసినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం పనులను చకచకా పూర్తి చేసేందుకు అనుకూల సమయం...ఈ వేసవిలోగా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వస్తున్నది.

### తొలివిడతలో 58 చోట్ల..

2020 అక్టోబరు మాసంలో పెద్ద ఎత్తున వరదలు సంభవించిన తర్వాత వరద నీటికి శాశ్వత చర్యలు చేపట్టాలని కేసీఆర్ ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలోనే నగరాన్ని శాశ్వతంగా వరద ముంపు నుంచి తప్పించేందుకు ఎస్‌ఎన్‌డీపీ తొలి తొలి విడత పథకం ద్వారా రూ. 985.45కోట్లతో 58 చోట్ల నాలా అభివృద్ధి పనులకు చేపట్టింది. పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని రూ.531కోట్లతో 29 ప్రాంతాలలో వేలాది కాలనీల వరద ముంపు సమస్యకు పరిష్కారం చూపింది. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్‌ఎన్‌డీపీ పనులను పట్టించుకోవడమే మానేసింది. క్షేత్రస్థాయిలో నత్తనడకన సాగుతున్న పనులు సర్కారు అవలంబిస్తున్న తీవ్ర జాప్యానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. కాంట్రాక్టర్లకు చెల్లింపులను నిలిపివేశారు. చాలా చోట్ల గోడలు, స్లాబుల నిర్మాణ పనులు మరీ నెమ్మదిగా జరుగుతున్నాయి.

ఫలితంగా రూ.394.65 కోట్లతో 11 చోట్ల జరుగుతున్న పనులపై తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా వచ్చే వర్షాకాలం నాటికల్లా ఈ పెండింగ్ ప నులు పూర్తి కాకపోతే సరూర్‌నగర్, నాగోల్, సి కింద్రాబాద్, ఎల్బీనగర్, చార్మినార్, చాంద్రాయణగుట్ట హయత్‌నగర్, వనస్థలిపురం, హబ్సిగూడ, ఉప్పల్ రామంతాపూర్‌తో పాటు శివారు ప్రాంతాలైన బడంగ్‌పేట, జల్‌పల్లి, పెద్ద అంబర్‌పేట, మీర్‌పేట ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. కాగా ఎస్‌ఎన్‌డీపీ రెండవ దశలో రూ.667.28కోట్లతో 40 చోట్ల పనులకు శ్రీకారం చుట్టగా...పనులు అంగుళం కూడా ముందుకు సాగకపోవడం గమనార్హం.

**ఎస్‌ఆర్‌డీపీ రెండవ దశ పనుల్లోనూ జాప్యమే?**

| పనుల పురోగతి | పనుల సంఖ్య | వ్యయం | పొడవు (కి.మీ) |
|---|---|---|---|
| పురోగతిలో ఉన్నవి | 4 | 13.9 | 2.070 |
| ప్రారంభ దశలో | 15 | 184.59 | 15.953 |
| టెండర్ దశలో | 11 | 189.58 | 21.291 |
| డీపీఆర్ దశలో | 4 | 140.44 | 8.792 |
| | 34 | 528.51 | 48.106 |

**ఎస్‌ఎన్‌డీపీ ఫేజ్-1 పనులు**

| పరిధి | పనుల సంఖ్య | కిలోమీటర్లు | వ్యయం | పురోగతి |
|---|---|---|---|---|
| జీహెచ్‌ఎంసీ | 40 | 50.7 | రూ.782.25 | 29 చోట్ల పూర్తి, ఆరు ప్రాంతాల్లో పురోగతి, ఐదు స్థానంలో నిలిచిన పనులు |
| జీహెచ్‌ఎంసీ అవతల యుఎల్‌బిలు | 23 | 29.35 | రూ.369.15 | 15 చోట్ల పూర్తి, 8 ప్రాంతాల్లో నిలిపివేశారు. |
| | 63 | 80.05 | రూ. 1151.4 కోట్లు | |

- కాగా చార్మినార్ జోన్‌లో ఆరు చోట్ల పనులకు గానూ రూ.138.77కోట్ల జరుగుతుండగా.. 9.29 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం నత్త నడకన పనులు జరుగుతున్నాయి. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన 14 నెలలుగా రెండవ దశ పనులకు శ్రీకారం చుట్టగా.. టెండర్ల దశలోనే కాలయాపన చేస్తున్నది. పూర్తి స్థాయిలో పనులను పట్టాలెక్కించకపోవడం గమనార్హం.

## అంత్యక్రియలకు వెళ్లి వస్తూ మహిళ మృతి

ఆమనగల్లు, ఫిబ్రవరి 26 : బంధువు అంత్యక్రియలకు వెళ్లిన మహిళ తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన ఘటన ఆమనగల్లులో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. సరూర్‌నగర్‌కు చెందిన జగదీశ్వర్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో అచ్చంపేటలో బంధువు అంత్యక్రియలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆమనగల్లులోని కాటన్‌మిల్లు సమీపంలో ఉన్న పాయింట్ వద్ద కారుకు చార్జింగ్ పెట్టారు. జగదీశ్వర్ భార్య జయమ్మ (67) వాష్‌రూమ్ వెళ్లడానికి రహదారి దాటుతున్న సమయంలో ఎండీ అసిమ్ ద్విచక్రవాహనాన్ని అతి వేగంగా నిర్లక్ష్యంగా నడుపుతూ ఆమెను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## గ్రేటర్ @32.2డిగ్రీలు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) తూర్పు దిశ నుంచ వీస్తున్న గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 32.2డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 20.4డిగ్రీలు, గాలిలో తేమ 51శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

### స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌పై..

# నగరంలో సర్వే

- నగర పరిశుభ్రతపై సిటిజన్ ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్న బల్దియా
- వచ్చే నెలలో నగరానికి రానున్న కేంద్ర బృందం




సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సర్వే మొదలైంది. ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కీలక నగరాలకు ర్యాంకులను ప్రకటిస్తూ వస్తున్నది. 2015 నుంచి 2023 వరకు 10 లక్షల జనాభా కంటే ఎక్కువ సిటీ జాబితాలో హైదరాబాద్ మెరుగైన ర్యాంకింగ్ సాధించింది. గతేడాది సిటీ 9వర్యాంకు, భారతదేశంలో ఫైవ్ స్టార్ రేటింగ్ పొందిన చెత్త రహిత నగరంగా హైదరాబాద్‌కు అవార్డు దక్కింది. దీంతో స్వచ్ఛ సర్వేక్షణ్–2024పై సర్వే ప్రారంభించింది. ఇప్పటి వరకు 2వేల మంది పౌరుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. నగర పౌరులకు నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, స్వచ్ఛతపై అభిప్రాయాలను తీసుకునేందుకు 10 ప్రశ్నలతో కూడిన ఫీడ్ బ్యాక్‌ను తీసుకుంటున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో భాగంగా సిటిజన్ ఫీడ్ బ్యాక్ లింకును పంపించి, క్యూఆర్ కోడ్, ఆ తర్వాత సంబంధిత పౌరులకు ప్రశ్నలు వేసి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. మీ ఏరియాలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎలా ఉంటుంది? జీవీపీ (తరచూ చెత్త వేసే ప్రాంతాలు/గార్బేజి వనరేబుల్ పాయింట్లు) ఉంటున్నాయా? తదితర ప్రశ్నల ద్వారా అభిప్రాయాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే వచ్చే నెలలో కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం నగరంలో పర్యటించనున్నది. ఏప్రిల్ నెలలో ర్యాంకుల జాబితాను కేంద్రం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. గతంలో కంటే మెరుగైన ర్యాంకులు సాధిస్తుందా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే..!!